క్లుప్తంగా

శాంతి భద్రతలకు సహకరించాలి



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని సీఐ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండల సీఐగా శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు పనిచేసిన శశిధర్‌రెడ్డి మందమర్రి సర్కిల్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గతంలో ఎస్సైగా ఏడాదిన్నర ఇక్కడ పనిచేసిన అనుభవం ఉందని, ప్రజలు నేరాల నియంత్రణకు సహకరించాలని కోరారు. బాధ్యతలు చేపట్టిన సీఐని ఎస్సై రమాకాంత్, సహచర సిబ్బంది, ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు.

అర్చనకు సన్మానం



సన్మానిస్తున్న రెడ్డిసంఘం మండల నాయకులు

చందుర్తి : ఒకేసారి రెండు ప్రభుత్వ కొలువులు సాధించిన మండలంలోని ఆశిరెడ్డిపల్లెకి చెందిన అంచ అర్చన అలియాస్ వనజను మండల రెడ్డి సంఘం నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం మండల అధ్యక్షుడు దూది శ్రీనివాస్ రెడ్డి, రెడ్డి యువజన సంఘం మండల అధ్యక్షుడు పూడూరి జీవన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పూడూరి ప్రశాంత్ రెడ్డి, కూతురు మహేందర్ రెడ్డి, ఆశిరెడ్డిపల్లె, హన్మాజిపేట గ్రామాల మాజీ సర్పంచులు అంచ సుమ శ్రీహరి రెడ్డి, జింక శ్రీనివాస్‌రెడ్డి, ఆశిరెడ్డిపల్లె రెడ్డి సంఘం అధ్యక్షుడు నల్మాస్ రవీందర్ రెడ్డి, దారం హన్మంతురెడ్డి, ప్రమోద్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'ఆగయ్యపై ఆరోపణలు చేస్తే ఊరుకోబోం'



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట: ప్రజాసమస్యలు పరిష్కరించాల్సిందిపోయి బీఆర్‌ఎస్ నాయకుల గురించి అవాస్తవాలు మాట్లాడటం సరికాదని ఆ పార్టీ మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు ఎడ్ల సందీప్ అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేర్చడం చేతకాక తమ పార్టీ నేతలను విమర్శిస్తున్నారని ఆరోపించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యపై లేనిపోని ఆరోపణలు చేస్తే ఖబర్దార్ అన్నారు. అవినీతికి పాల్పడిన కాంగ్రెస్ నాయకులే తమ నాయకులను విమర్శించడం సిగ్గు చేటన్నారు. జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, నాయకులు అందె సుభాష్, గుల్లపల్లి నర్సింహారెడ్డి, భాస్కర్, ఎడ్ల లక్ష్మణ్, నంది కిషన్, వెంకట్‌రెడ్డి, హసన్, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.


అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

గంభీరావుపేట: మండలకేంద్రంలోని ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో వార్షికోత్సవ, సైన్స్‌ఫేర్ సంబరాలను శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల సైన్స్ ప్రయోగాలను ప్రదర్శించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ప్రిన్సిపల్ సంతోష్‌రెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పుస్తకాలు పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న రాధా కృష్ణమాచార్యులు

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ హైస్కూల్‌లోని 1982–83 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థి రాధాకృష్ణమాచార్యులు 9, 10వ తరగతుల విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్ పుస్తకాలు పంపిణీ చేశారు. స్కూల్‌లో శనివారం నిర్వహించినకార్యక్రమంలో 110 మంది విద్యార్థులు పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మనోహరాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

వి'వాహ్'..భోజనంబు

- పెళ్లిళ్లలో రుచికర 'విందులు'
- శుభకార్యాల్లో లేటెస్ట్ ట్రెండ్
- కస్టమర్లు కోరిన రుచుల్లో వంటకాలు
- వండి..వార్చుతున్న క్యాటరింగ్ టీమ్స్..



పూర్వం నుంచి ఇప్పటివరకు పెళ్లిళ్లలో రుచికర భోజనాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. కాలానుగుణంగా శుభకార్యాల్లో వెరైటీ రుచుల్లో అన్నం, కూరలు, పండ్లు, స్వీట్స్, జ్యూస్ ఇలా అన్నింటినీ అతిథులకు వడ్డిస్తున్నారు. ఈ క్రమంలో ఫంక్షన్ నిర్వాహకులు భోజన తంతును నిర్వహించడం భారమైంది. దీంతో పలు క్యాటరింగ్ కంపెనీలు పెళ్లిళ్లు, పేరంటాల్లో కోరిన రుచుల్లో భోజనాలు వండి వార్చుతున్నారు. ఈసిస్టమ్ సిరిసిల్లలో లేటెస్ట్ ట్రెండ్‌గా మారింది.

- సిరిసిల్ల టౌన్

సండే స్పెషల్

పెళ్లి భోజనాల్లో మారుతున్న ట్రెండ్‌కు అనుగుణంగా క్యాటరింగ్ భోజనాలకు పట్టణవాసులు అలవాటు పడుతున్నారు. సిరిసిల్లతో పాటు అన్ని మండల కేంద్రాల్లో క్యాటరింగ్ కంపెనీలు నిరుద్యోగులకు ఉపాధినిస్తున్నాయి. వీరు ఫంక్షన్ నిర్వాహకులతో ప్లేట్ భోజనం చొప్పున రేటును కుదుర్చుకుంటారు. లేదంటే ఫంక్షన్ నిర్వాహకులు వంటసామగ్రి, కిరాణా సామాన్లు అందిస్తే..వంటలు చేసి..తమ కంపెనీ ఉద్యోగులతోనే వడ్డిస్తున్నారు.

బ్రేక్ ఫాస్ట్ టు ఈవినింగ్ స్నాక్స్..



క్యాటరింగ్ చేసేవారికి పెళ్లి భోజనాల కాంట్రాక్టు ఇస్తే చాలు ఉదయం బ్రేక్ ఫాస్ట్ మొదలుకొని వెల్‌కమ్ ట్రీట్, టీ, కాఫీ, లంచ్, ఈవినింగ్ స్నాక్స్ వరకు కాంట్రాక్టు పద్ధతుల్లో రుచికరమైన ఆహార పదార్థాలను క్యాటరింగ్ వారు అందిస్తున్నారు. ఫంక్షన్ నిర్వాహకులు కనీసం తాగునీరు కూడా తెప్పించాల్సిన అవసరం ఉండదు. అయితే ఒక్కొక్కరికి ధర నిర్ణయించి ప్లేటు చొప్పున చార్జీలు వేస్తారు. వీటిలో తాగునీరు, టిష్యూ పేపర్స్ సహా భోజనాన్ని వండి..వార్చి చార్జీలు తీసుకుంటారు. కాంట్రాక్టు ఇచ్చిన తీరుగా వెజ్, నాన్‌వెజ్ భోజనాలను అందిస్తున్నారు. భోజనంలో పదుల సంఖ్యలో కర్రీలు, బిర్యాని, రోటీలు, అన్నం తదితరాలను ఉంచుతారు. శాఖాహారం రూ.150 నుంచి రూ.700, మాంసాహారం రూ.300 నుంచి రూ.1200 వరకు ఒక్కో ప్లేటుకు చార్జీలు విధిస్తారు.

లేటెస్ట్' గా కర్రీస్..



క్యాటరింగ్ ద్వారా కస్టమర్లు కోరిన రుచుల్లో భోజనాలు అరేంజ్ చేస్తున్నారు. ఆర్డర్లను బట్టి తమ హోటల్స్‌లో, ఎక్కువ సంఖ్యలో భోజనాలు ఆర్డర్ ఇస్తే..ఫంక్షన్ హాల్స్‌కు వచ్చి వంటలు చేసి వండుతారు. వీటిలో చికెన్ కర్రీ, చికెన్ ఫ్రై, జింజర్ చికెన్, చికెన్ లెగ్, నాటుకోడి, గ్రిల్ చికెన్, మటన్ కర్రీ, మటన్ ఫ్రై, లివర్, తలకాయ, గోంగూర బోటి, పీతల కర్రీ, ఫ్రాన్స్, కైమా, బోటీ, ఫిష్, పప్పు, చారు, గోకరకాయ, క్యాబేజి, టమాట, ఆలుగడ్డ, ఆకుకూరలు, ఫిష్ ఫ్రై, రాయలసీమ చికెన్, దొన్నె బిర్యాని, రాజుగారి చేపల పులవ్, బెల్లం జిలేబి, తవ్వా స్వీట్, ఖుర్బాన్ కా మీటా, తెలంగాణ పోలెలు, పూతరేకులు, చాట్ ఐటమ్స్, ఇలా అన్ని వెరైటీల్లో వెజ్, నాన్‌వెజ్, స్వీట్స్, సాఫ్ట్ డ్రింక్స్, జ్యూస్, ఫ్రూట్ సలాడ్స్, ఐస్‌క్రీమ్స్‌ను క్యాటరింగ్ టీమ్స్ అందిస్తున్నారు.

పన్నెండేళ్లుగా క్యాటరింగ్



గతంలో వేములవాడలో ఓ మాస్టర్ వద్ద వంట నేర్చుకున్నా. సిరిసిల్లలో సుమారు పదిహేనేళ్లుగా క్యాటరింగ్ పద్ధతిని కస్టమర్లు అడుగుతున్నారు. మారుతున్న ట్రెండ్‌కు అనుగుణంగా స్థానికంగా క్యాటరింగ్ చేస్తున్నా. నావద్ద వంట మాస్టర్లు 30 మంది, అసిస్టెంట్లు 30మంది, సర్వీస్ బాయ్స్ 80 మంది పనిచేస్తారు. శాఖాహారం భోజనానికి ప్లేట్‌కు రూ. 200 నుంచి రూ.1200, మాంసాహారానికి రూ. 250 నుంచి రూ.2,500 వరకు చార్జీ విధిస్తాం.

– పాము కార్తీక్, వినాయక క్యాటరింగ్ సిరిసిల్ల

చిన్న ఫంక్షన్లకు అందిస్తాం



ఇరవై ఏళ్లుగా పట్టణంలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వహిస్తూ పదేళ్లుగా చిన్నచిన్న ఫంక్షన్లకు క్యాటరింగ్ చేస్తున్నా. రెండు, మూడు వందలమందికి మా హోటల్‌లోనే వంటచేసి ఆటోల్లో ఫంక్షన్‌హాల్‌కు తీసుకెళ్లి వడ్డిస్తాం. వెజ్‌లో నాలుగు రకాల కర్రీస్, స్వీట్, పెరుగు, నాన్‌వెజ్‌లో చికెన్, మటన్ బిర్యాని, ఫిష్ కర్రీ, నాన్‌వెజ్‌లో అన్నివిధాలా కర్రీస్‌ను అందిస్తాం. నాన్‌వెజ్ భోజనం ప్లేటుకు రూ.200 నుంచి రూ.300, వెజిటేరియన్‌కు రూ.100 నుంచి రూ.150వరకు చార్జీలు తీసుకుంటాం.

అయిలి రమేశ్, ఫ్రెండ్స్ ఫాస్ట్‌ఫుడ్

క్యాటరింగ్ ద్వారా ఉపాధి



ముస్తాబాద్ మండలంలోని బందనకల్‌లో దాదాపు 150 కుటుంబాల వారికి వంటలు చేస్తాం. ఫంక్షన్లు, ప్రైవేటు కార్యక్రమాలకు కాంట్రాక్టు తీసుకుంటాం. సిరిసిల్ల, సిద్దిపేట, హైదరాబాద్, ఢిల్లీ, కరీంనగర్ తదితర పట్టణాల్లో కూడా వంటలు చేస్తాం. వెజిటేరియన్ ప్లేట్‌కు రూ.160 నుంచి రూ. 200, నాన్ వెజిటేరియన్ రూ.300 నుంచి రూ. 400 వరకు తీసుకుంటాం. మొత్తంగా 250 మంది యువకులం వంటలు, క్యాటరింగ్ ద్వారా ఉపాధి పొందుతున్నాం.

–జిల్ల నాగరాజు, బందనకల్, ముస్తాబాద్

యాసంగి పంటకు బోనస్ ఇవ్వాలి



మాట్లాడుతున్న బోయినపల్లి వినోద్‌కుమార్

బోయినపల్లి: ప్రభుత్వం యాసంగి పంటలకు రూ.500 బోనస్ ఇవ్వాలని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని వెంకట్రావుపల్లిలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య ఆధ్వర్యంలో శనివారం మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆరు గ్యారంటీల అమలుచేసే వరకు ఊరుకునేది లేదన్నారు. ఎంపీ బండి సంజయ్ కరీంనగర్‌కు చేసిందేమి లేదని, బీఆర్‌ఎస్ పర్యటనతోనే మేడిగడ్డ పిల్లర్ల మరమ్మతుకు ప్రభుత్వం రూ.400 కోట్లు మంజూరుచేసిందన్నారు. జెడ్పీటీసీ ఉమ, చెన్నాడి అమిత్‌కుమార్, వైస్ ఎంపీపీ నాగయ్య, ఎంపీటీసీలు సంబ బుచ్చమ్మ, ఐరెడ్డి గీత, రాజేశ్వరి, డబ్బు మమత, మాజీ ఎంపీపీలు సత్తినేని భాగ్యలత, మాధవ్, నాయకులు లెంకల సత్యనారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి, అంజన్‌రావు, రాములు, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

సిరిసిల్లఎడ్యుకేషన్: విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. పట్టణంలో సెలెస్టియల్ హైస్కూల్ లో పదో తరగతి విద్యార్థులకు ఫేర్ వెల్ డే నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ చక్రపాణి, జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్, కౌన్సిలర్ ఆకుల కృష్ణ, మండల విద్యాధికారి రఘుపతి పాల్గొన్నారు.

సంస్కృత పాఠశాల పూర్వ విద్యార్థులకు 'గురుకుల' కొలువులు

వేములవాడఅర్బన్: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర సంస్కృత పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు ప్రభుత్వ గురుకుల ఉద్యోగాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ మల్లారెడ్డి తెలిపారు. సామ రాజశేఖరరెడ్డి జేఎల్, జాగిరి చంద్రశేఖర్ పీజీటీ, తోకల మానస, బొల్లి నీరజ, గంప రవలి, జంగం అపర్ణ టీజీటీ ఉద్యోగాలు సాధించారు. వీరిని విద్యాసంస్థల కార్యదర్శి, రాజన్న ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ మల్లారెడ్డి అభినందించారు.

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాజగోపాల్

వేములవాడఅర్బన్: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిదని కళాశాల ప్రిన్సిపాల్ డా.బీ. రాజగోపాల్ అన్నారు. వేములవాడ మండలం అగ్రహారం శ్రీ రాజరాజేశ్వరస్వామి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఓటరు అవగాహన సదస్సు నిర్వహించారు. సుమారు రెండు కోట్ల మంది యువతీ యువకులు కొత్తగా 2024 ఎన్నికల్లో ఓటు వేయనున్నారన్నారు. ఏ అభ్యర్థికి ఓటు వేయడం ఇష్టం లేకపోతే నోటా నొక్కాలన్నారు. ఇటీవల యువత పెద్దఎత్తున ఎన్నికల్లో పాల్గొనడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు సయ్యద్ షహబాజ్, శ్రీదేవి, కనకయ్య, విద్యార్థులు తదితరులు ఉన్నారు.



సిరిసిల్ల టౌన్: నివాళి అర్పిస్తున్న నాయకులు



వేములవాడ రూరల్ : నివాళి అర్పిస్తున్న అధికారులు

శ్రీపాదరావు ఆశయ సాధనకు కృషిచేయాలి

సిరిసిల్ల టౌన్/సిరిసిల్ల క్రైం/వేములవాడ అర్బన్/వేములవాడ రూరల్/ఎల్లారెడ్డిపేట/బోయినపల్లి/ చందుర్తి/ముస్తాబాద్/ తంగళ్లపల్లి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు పేద ప్రజల కోసం చేసిన సేవలు మరువలేనివని అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులు అన్నారు. జిల్లావ్యాప్తంగా సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో శ్రీపాదరావు 87వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలకు, చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. శ్రీపాదరావు చేసిన మంచి పనులే ఆయనను చిరస్థాయిగా గుర్తుండిపోయేలా చేశాయని గుర్తు చేశారు. నేటి తరానికి ఆయన ఆదర్శమని కొనియాడారు. ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు.

సంక్షిప్త వార్తలు

బీజేపీ నాయకుల సంబరాలు

సిరిసిల్లటౌన్: కరీంనగర్ బీజేపీ పార్లమెంటు అభ్యర్థిగా ఎంపి బండి సంజయ్‌ను అధిష్టానం ప్రకటించడంపై సిరిసిల్లలో సంబరాలు జరిపారు. గాంధీచౌక్‌లో పార్టీ శ్రేణులు పటాకులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్ రవీందర్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి, కరెడ్ల మల్లారెడ్డి, పట్టణ నాయకులు, బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 26 మందికి జైలు

సిరిసిల్లక్రైం: మద్యంతాగి వాహనాలు నడిపిన 26 మందికి రెండ్రోజుల జైలు విధిస్తూ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ శనివారం తీర్పునిచ్చారు. సిరిసిల్ల టౌన్ సీఐ రఘుపతి వివరాల ప్రకారం.. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 26 మందికి ఒక్కొక్కరికి రెండ్రోజుల జైలు శిక్షతో పాటుగా రూ.3వేలు, 25 మందికి రూ.3వేల చొప్పున జరిమానా విధించారు. పట్టణ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా 51మంది మందుబాబులు పట్టుబడ్డారు. కొందరికి జైలు, మరికొందరికి జరిమానా విధించారు.

ఇసుక ట్రాక్టర్ డ్రైవర్ అరెస్టు

ముస్తాబాద్: కానిస్టేబుల్ పట్ల దురుసుగా ప్రవర్తించిన మండలంలోని ఆవునూర్ గ్రామానికి చెందిన ఇసుక ట్రాక్టర్ డ్రైవర్ శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో వెంకటరమణ తెలిపారు. మూడు రోజుల క్రితం అనుమతులు లేకుండా మానేరు వాగునుంచి ఇసుకను ట్రాక్టర్‌లో తరలిస్తుండగా కానిస్టేబుల్ సత్యనారాయణ పట్టుకున్నాడు. ట్రాక్టర్‌ను ఠాణాకు తీసుకొచ్చే క్రమంలో కానిస్టేబుల్‌ను నెట్టివేసి శ్రీనివాస్ పరారయ్యాడు. ట్రాక్టర్‌ను ఠాణాకు తరలించడంతో పాటు అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): సైన్స్ నిత్యజీవితంలో ఒక భాగమని, విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తిని పెంచుకోవాలని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ చక్రపాణి అన్నారు. మండలకేంద్రంలోని శుభోదయం ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో నిర్వహించిన సైన్స్‌ఫేర్‌లో విద్యార్థుల ప్రయోగాలను తిలకించారు. కరస్పాండెంట్ శ్రీనివాస్ యాదవ్, ప్రిన్సిపాల్ సుధాకర్, టీచర్లు పాల్గొన్నారు.

బియ్యం వితరణ

ముస్తాబాద్: మండలకేంద్రానికి గొట్టె ఎల్లం ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ నాయకుడు నర్సింలు 50కిలోల బియ్యం అందించారు. కొండయ్య, శంకరయ్య, కిషన్, నర్సయ్య, వెంకటయ్య, బాల్‌నర్స్ ఉన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

వీర్నపల్లి: నేడు జిల్లాకేంద్రంలో జరిగే యాంటీ డ్రగ్ 5కే రన్‌లో పాల్గొనే వారికి ఉదయం 5 గంటలకు పోలీస్‌స్టేషన్ నుంచి ప్రత్యేకవాహనం ఏర్పాటు చేసినట్లు ఎస్సై జిల్లెల రమేశ్ తెలిపారు. యవకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'పల్స్‌పోలియో' కు ఏర్పాట్లు పూర్తి

కోనరావుపేట: మండలంలోని అన్నిగ్రామాల్లో పల్స్ నేటి పోలియో కార్యక్రమానికి ఏర్పాటు చేసినట్లు మండల వైద్యాధికారి వేణుమాధవ్ తెలిపారు. మండలంలో 28 గ్రామాలకు ఎనిమిది ఆరోగ్య ఉపకేంద్రాలు, ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది. వీటి పరిధిలో ఐదేళ్లలోపు చిన్నారులు 3,719 మంది ఉన్నట్లు గుర్తించారు. 45 పోలింగ్‌బూత్‌లు ఏర్పాటు చేసినట్లు వైద్యాధికారి పేర్కొన్నారు.

పేదింటి యువతులకు వరం 'కల్యాణలక్ష్మి'



చెక్కు అందిస్తున్న ఎంపీపీ శరత్‌రావు

ముస్తాబాద్: పేదలకు కల్యాణలక్ష్మి పథకం వరం లాంటిదని ఎంపీపీ జనగామ శరత్‌రావు అన్నారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాల యంలో 38 కుటుంబాలకు కల్యాణలక్ష్మి చెక్కులను శనివారం పంపిణీ చేశారు. జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, తహసీల్దార్ సురేశ్, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

చంపుతానని బెదిరించిన ముగ్గురిపై కేసు

సిరిసిల్లక్రైం: భూమి ఆక్రమించుకునేందుకు యత్నించిన ముగ్గురిపై శనివారం కేసు నమోదు చేసి అందులో ఒకరిని రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల డీఎస్పీ భీంశర్మ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం..టెక్స్‌టైల్ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్‌కు చెందిన సర్వే 1562లో 363 గజాల భూమిని, శివనగర్‌లో నివాసముండే కల్లూరి చందన, చౌటుపల్లి చంద్రశేఖర్, రెడ్డబోయిన గోపిలు అక్రమంగా ఆక్రమించేందుకు దస్తావేజులు సృష్టించారు. భూమిని ఆక్రమించుకునేందుకు కల్లూరి చందన, చౌటుపల్లి చంద్రశేఖర్‌కు జీపీఏ చేసిన అనంతరం చౌటుపల్లి చంద్రశేఖర్ అట్టి భూమిని రెడ్డబోయిన గోపికి విక్రయించాడని, తర్వాత అందులో సగం భూమిని రెడ్డబోయిన గోపి కల్లూరి చందనకు రిజిస్ట్రేషన్ చేశాడు. అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన భూమిని తమకు అప్పగించాలని కోరగా తనను చంపుతామని బెదిరించారని గూడూరు ప్రవీణ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కల్లూరి చందన, చౌటపల్లి చంద్రశేఖర్, రెడ్డబోయిన గోపిపై పోలీసులు కేసు నమోదు చేశారు. రెడ్డబోయిన గోపిని కోర్టులో హాజరుపర్చగా కోర్టు ఆదేశానుసారం రిమాండ్ తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

వీర్నపల్లి: మండలంలోని భూక్యతండా గ్రామ పంచాయతీ పరిధిలోని రాశిగుట్టతండా మండల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు భూఖ్య రఘుపతి శనివారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. బలరాం, మోహన్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

గుంతల రోడ్డుకు మరమ్మతులు

సాక్షి స్పందన



కోనరావుపేట: మండలంలోని కొలనూర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రధాన రహదారికి మరమ్మతు పనులు చేపట్టారు. సిరిసిల్ల–కోనరావుపేట ప్రధాన రోడ్డుకు అడ్డుగా తవ్వడంతో గతనెల 15న 'ప్రమాదకర నిర్లక్ష్యం' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు ప్రమాదకరంగా ఉన్న గుంతను సిమెంట్‌తో పూడ్చివేశారు. రోడ్డు మరమ్మతుతో ఇబ్బందులు తొలగాయని వాహనదారులు పేర్కొన్నారు.

'కేకే'ను విమర్శిస్తే సహించం



సిరిసిల్లటౌన్: మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు



తంగళ్లపల్లి: మాట్లాడుతున్న ప్రవీణ్ జే టోని

సిరిసిల్లటౌన్: బీఆర్‌ఎస్ పదేళ్లలో చేపట్టిన అభివృద్ధి అంతా అవాస్తవమని కాంగ్రెస్ చేనేత, ఎస్సీ సెల్స్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప, ఆకునూరి బాలరాజు విమర్శించారు. పదేళ్లలో సిరిసిల్లకు ఎమ్మెల్యే కేటీఆర్ చేసిందేమీ లేదన్నారు. సిరిసిల్లలో బతుకమ్మ చీరలకు సంబంధించిన రూ. 260 కోట్లు బకాయిలు కేటీఆర్ పుణ్యమేనన్నారు. బీఆర్‌ఎస్ నేతలు కేకే మహేందర్‌రెడ్డిపై అవాకులు చెవాకులు పేలితే సహించబోమన్నారు. సిరిసిల్ల అభివృద్ధి రాజకీయాలకు అతీతంగా కలిసి రావాలని హితవు పలికారు. కౌన్సిలర్ రామానుజం, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, పట్టణ అధ్యక్షురాలు స్వరూప, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి(సిరిసిల్ల): కేకే.మహేందర్ రెడ్డిని విమర్శిస్తే తగిన బుద్ధి చెబుతామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. పెద్దూరుకు చెందిన గల్ఫ్ బాధితులకు 18 ఏళ్ల జైలు శిక్షపడితే మొదట స్పందించింది కేకే.మహేందర్ రెడ్డి అన్నారు. అభివృద్ధి పేరుతో కమీషన్లు మింగారని, బీఆర్‌ఎస్ నాయకులు చేసిన అవకతవకలను వెలికి తీస్తామన్నారు. ఇసుక రవాణా, చెక్‌డ్యాంల నిర్మాణం పేరుతో రూ.వేల కోట్లు దోపిడీ చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు భరత్ గౌడ్, అరెపల్లి బాలు, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఖబర్దార్ అని కాంగ్రెస్ పార్టీ మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు సుడిది రాజేందర్ అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మహేందర్‌రెడ్డిని విమర్శించడం సరికాదన్నారు. ఆగయ్య బేషరతుగా మహేందర్‌రెడ్డికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు కృష్ణమూర్తి, సాహెబ్, రాజునాయక్, బాబు, రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు రాజీనామా



జెడ్పీ సీఈవోకు రాజీనామా లేఖను అందిస్తున్న రవి చందర్‌రావు

వేములవాడఅర్బన్: వేములవాడ అర్బన్ మండల వైస్ ఎంపీపీ రేగులపాటి రవిచందర్‌రావు తన వైస్ ఎంపీపీ పదవికి రాజీనామా చేశారు. శనివారం రాజీనామా లేఖను జెడ్పీ సీఈవో ఉమారాణికి అందజేశారు. ఆయన వెంట జడ్పీటీసీ మ్యాకల రవి ఉన్నారు.

వేడెక్కిన రాజకీయం..

వేములవాడ అర్బన్ మండల రాజకీయం హాట్ టాఫిక్‌గా మారింది. అర్బన్ మండలంలో ఆరు ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. ఎంపీపీ బూర వజ్రమ్మ బీఆర్‌ఎస్, వైస్ ఎంపీపీ రేగులపాటి రవిచందర్‌రావు బీఆర్‌ఎస్, చీర్లవంచ బీఆర్‌ఎస్ ఎంపీటీసీ, రుద్రవరం ఇండిపెండెంట్ ఎంపీటీసీ, అనుపురం కాంగ్రెస్ ఎంపీటీసీ, సంకెపల్లి బీజేపీ ఎంపీటీసీ సభ్యులుండగా ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగా బీఆర్‌ఎస్ ఇద్దరు ఎంపీటీసీలు ఒకరు కాంగ్రెస్‌లో చేరారు. మరొకరు పార్టీకి రాజీనామా చేశారు. ఒకరు కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ, మరొకరు బీజేపీ ఎంపీటీసీతో నలుగురు ఎంపీటీసీ సభ్యులు కలిసి ఇటీవల వైస్ ఎంపీపీ స్థానానికి ఆవిశ్వాసం కోసం ఆర్డీవోకు వినతిపత్రం అందించారు. దీంతో ఈనెల 5న మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో అవిశ్వాస బలపరీక్ష ఉంటుందని అధికారులు తెలిపారు.